సాక్షి
చిత్తూరు
మంగళవారం । 5 । ఆగస్టు । 2025



అమ్మ పాలే బిడ్డకు అమృతం

జిల్లాలో తల్లిపాలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. తల్లిపాలే బిడ్డకు అమృతమని ఉద్ఘాటిస్తున్నారు. - 8లో



మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలని..

రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలని చౌడేపల్లెలోని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. - 8లో



విన్నవించినా..ఫలితం లేదు సార్!

సమస్యలపై అధికారులకు విన్నవిస్తున్నా ఫలితం లేకుండా పోతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. - 8లో

డంప్.. జంప్!

అధికారాన్ని అడ్డం పెట్టుకుని కూటమి నేతలు ఉచితం మాటున ఇసుకను అడ్డంగా దోచేస్తున్నారు. అధికారికంగా చిత్తూరు మండలంలోని పాలూరు వద్ద ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్ పక్కనే అనధికారికంగా మరో డంప్ ఏర్పాటు చేశారు. పగలంతా ఆ డంప్‌లో ఇసుక లోడ్ చేసి రాత్రి పూట తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలోనే ఈ దందా సాగుతున్నా ఎవ్వరూ అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.



పాలూరు అనధికారిక ఇసుక డంప్

- చిత్తూరు మండలంలో జోరుగా ఇసుక దోపిడీ
- పాలూరులో పాతుకుపోయిన ఇసుకాసురులు
- అధికారిక డంప్ పేరు చెప్పి అనధికారిక డంప్
- తమిళనాడుకు యథేచ్ఛగా తరలింపు
- కూటమి నేతల కన్నుసన్నల్లో చెలరేగుతున్న మాఫియా
- పట్టించుకోని మైనింగ్ శాఖ

సాక్షి టాస్క్‌ఫోర్స్, తిరుపతి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చిత్తూరు మండలంలో అధికార పార్టీ నేతలు చెలరేగిపోతున్నారు. వాగులు, వంకలు.. ఎక్కడ ఇసుక కనిపిస్తే అక్కడ గద్దల్లా వాలిపోతున్నారు. మండలంలోని అనగల్లు, బీఎస్‌ఆర్‌పేట రీచ్ కేంద్రంగా అక్రమ ఇసుక తవ్వకాలు మొదలు పెట్టారు. ప్రభుత్వం ఉచితమనే సరికి..ఇదే అదునుగా ఇసుకను యంత్రాలతో అడ్డదిడ్డంగా లోడేస్తున్నారు. ఆపై లారీలు, టిప్పర్లతో యథేచ్ఛగా చెన్నైకి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత మైనింగ్, రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

అధికారిక డంప్ పేరుతో...

ఇసుకను జిల్లా వ్యాప్తంగా అందజేయాలని కూటమి ప్రభుత్వం ఓ ప్రైవేటు కంపెనీకి బాధ్యతలను అప్పగించింది. ఇసుకను రీచ్‌ల నుంచి స్టాక్ పాయింట్‌కు తరలించేలా ఒప్పందం కుదుర్చుకుంది. చిత్తూరు మండలంలోని అనంతాపురం గ్రామం వద్ద స్టాక్ పాయింట్ ఏర్పాటుకు అనుమతిచ్చింది. అయితే ఆ స్టాక్ పాయింట్‌ను లోకల్‌గా కిల్ చేస్తున్నారు. కూటమి నేతలు కొందరు ఇసుకాసురులుగా అవతారమెత్తి...ఇసుక యథేచ్ఛగా తరలించేస్తున్నారు. కేటాయించిన ప్రాంతం వదిలి పాలూరు ప్రాంతంలో ఇసుక డంప్‌ను ఏర్పాటు చేయించారు. ఈ డంప్ కేంద్రంగా ఇసుక అక్రమ రవాణాకు కూటమి నేతలు పదును పెట్టారు.

అనధికారిక డంప్... ఇసుక జంప్

పాలూరు వద్ద ఏర్పాటు చేసుకున్న స్టాక్ పాయింట్‌లో అధికారికంగా ఇసుక డంప్ అవుతోంది. ఈ డంప్ పక్కనే కూటమి నేతలు అనధికారికంగా మరో డంప్ ఏర్పాటు చేసుకున్నారు. పగలంతా డమ్మీ డంప్‌లో టన్నుల కొద్దీ ఇసుకను నిల్వ చేసుకుని రాత్రి పూట అక్రమ వ్యాపారం నడిపిస్తున్నారు. రోజుకు 10 నుంచి 15 లారీల ఇసుకను డంప్ చేసుకుని తమిళనాడుకు సరఫరా చేస్తున్నారు. యంత్రాలతో లారీలకు లోడ్ చేసి పైన ప్లాస్టిక్ పట్ట కట్టేస్తున్నారు. అక్కడి నుంచి బీఎస్‌ఆర్‌పేట చెక్‌పోస్టు, కుర్చివేడు మార్గం మీదుగా తమిళనాడుకు తరలించేస్తున్నారు. అలాగే తాళంబేడు మీదుగా గుడిపాల మండలంలోని చీలాపల్లి వయా తమిళనాడుకు ఇసుక తరలిస్తున్నారు. ఇలా అధికారిక డంప్‌ను చూపించి.. అనధికార డంప్ నుంచి ఇష్టారాజ్యంగా ఇసుక తరలించి కోట్లకు పడగెత్తుతున్నారు.

నిఘా ఏమైంది?

ప్రైవేటు కంపెనీ ఇచ్చిన స్టాక్ పాయింట్ ఏర్పాటుకు నిఘా నేత్రం ఉండాలి. కచ్చితంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. అవేమీ ఇక్కడ కనిపించడం లేదు. మైనింగ్ శాఖ అధికారులు ఈ డంప్‌ను నిత్యం పర్యవేక్షించాలి. కానీ అవేవీ ఇక్కడ అమలు కావడం లేదు. దీంతో అక్రమార్కులు ఇసుకను దొడ్డి దారిన అమ్మేస్తున్నారు. కూటమి నేతలు ఏర్పరుచుకున్న ఓ గ్యాంగ్‌ను ఆ డంప్‌కు కాపలా పెట్టి యథేచ్ఛగా తరలించేస్తున్నారు. అటు వైపు ఎవరైనా తొంగి చూస్తే వారి వారి భరతం పడుతామంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఈ ఇసుక డంప్ పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఉన్నా పోలీసులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని అక్రమ ఇసుక వ్యాపారానికి కళ్లెం వేయాలని స్థానికులు కోరుతున్నారు.



పాలూరు స్టాక్ పాయింట్ నుంచి చీకటి పడ్డాక లారీలో తరలుతున్న ఇసుక

లారీ ఇసుక రూ.లక్ష



అనగల్లు, బీఎస్‌ఆర్‌పేట రీచ్‌లోని ఇసుకకు డిమాండ్ ఎక్కువ. తమిళనాడుతో పాటు కర్ణాటక రాష్ట్రంలో కూడా ఇక్కడి ఇసుకకు భలే డిమాండ్ ఉంటుంది. అక్కడి వ్యాపారులు కూడా ఈ ఇసుకను అక్రమార్కులు చెప్పిన మాటకు నో చెప్పకుండా కొనుగోలు చేస్తుంటారు. ఇలా ఒక లారీ ఇసుక కర్ణాటకకు రూ.1.2 లక్షలకు విక్రయిస్తున్నారు. తమిళనాడు రాష్ట్రంలో రూ.80 వేల నుంచి రూ. లక్ష వరకు విక్రయిస్తున్నారు.

అధిష్టానానికి ఫిర్యాదు చేసేందుకు రెడీ

పాలూరు కేంద్రంగా జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాపై అధిష్టానానికి ఫిర్యాదు చేయాలని కూటమిలోని ఓ వర్గం సిద్ధమైంది. అడ్డూఅదుపు లేకుండా ఎలా రవాణా చేస్తారంటూ మండిపోతోంది. బీఎస్‌ఆర్‌పేట చెరువంతా ఊడ్చేస్తున్నారని ఆగ్రహానికి గురవుతోంది. అదే తాము రవాణా చేసేటప్పుడు మాత్రం వారు ఎలా అడ్డుకున్నారో చూశామని పేర్కొంటోంది. ఇప్పుడు మాత్రం వాళ్లు ఎలా చేస్తారంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తోంది. త్వరలో ఈ అక్రమ వ్యవహారాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని ఆ వర్గం పేర్కొంటోంది.

ఇప్పుడేమీ ఇసుక వెళ్లడం లేదే!

"కేవలం ఇసుక డంప్ మాత్రమే చేస్తున్నాం. ఇంతవరకు అమ్మకాలు ఏమీ జరగడం లేదు. త్వరలో ప్రారంభిస్తాం. అక్రమంగా ఇసుక వెళ్తుంటే చర్యలు తీసుకుంటాం. సీసీ కెమెరాలు కూడా పెడతాం. రెండు రోజుల్లో పరిశీలిస్తాం. నిబంధనలు పాటించేలా చూస్తాం.

–సత్యనారాయణ, ఏడీ, మైనింగ్‌శాఖ, చిత్తూరు

న్యూస్‌రీల్

నేటి నుంచి రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ పర్యటన

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఈ నెల 5, 6 తేదీల్లో రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమాలాదేవి పర్యటించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏపీ స్టేట్ ఫుడ్ కమిషన్ మెంబర్ ఈనెల 5, 6 తేదీల్లో జిల్లాలోని రేషన్‌షాపులు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేయనున్నట్టు కలెక్టర్ వెల్లడించారు.

మరింత నాణ్యతగా లడ్డూలు



లడ్డూ తయారీని పరిశీలిస్తున్న ఈవో

కాణిపాకం: భక్తులకు రుచికరమైన లడ్డూను అందజేయాలని ఈవో పెంచలకిషోర్ సిబ్బందిని ఆదేశించారు. కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని లడ్డూ పోటును సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తయారీ పద్ధతులపై ఆరా తీశారు. తయారీలో నాణ్యతను పరిశీలించారు. భక్తులకు రుచికరమైన, పరిశుభ్రతతో కూడిన ప్రసాదాన్ని అందజేయాలని ఆయన అధికారులకు సూచించారు. తనిఖీలో డీఈవో సాగర్‌బాబు, ఏఈవోలు రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వం అందజేసే ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ అవార్డులకు జిల్లాలో అర్హత, ఆసక్తి గల వారు దరఖాస్తులు చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 2025 సంవత్సరానికి గాను అందజేస్తున్న ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. అదర్శప్రాయమైన పనులు, జాతీయ స్థాయిలో క్రీడలు, సంఘసేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, ఆర్ట్స్, లలిత కళలు వినూత్నమైన సేవలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 18 సంవత్సరాల లోపు (31వ తేదీ, జూలై 2025 నాటికి) పిల్లలు అర్హులన్నారు. అర్హత, ఆసక్తి గల వారు www.awards.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈనెల 15వ తేదీ లోపు దరఖాస్తులను చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు కలెక్టరేట్‌లోని ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రేపు జిల్లా స్థాయి క్రీడాపోటీలు

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరులో ఈనెల 6, 7 తేదీల్లో జిల్లా స్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. చిత్తూరు జిల్లా కేంద్రంలోని మెసానికల్ మైదానంలో ఈ నెల 6, 7 తేదీల్లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆర్చరి, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, అథ్లెటిక్స్, హాకీ, వాలీబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్ తదితర పోటీలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. జిల్లా స్థాయిలో గెలుపొందే క్రీడాకారులు ఈ నెల 12, 13 తేదీల్లో తిరుపతిలోని ఎస్వీయూ స్పోర్ట్స్ కాంప్లెక్సులో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ పోటీల్లో 18 నుంచి 21 సంవత్సరాల లోపు బాలబాలికలు అర్హులని వెల్లడించారు.

పరిశ్రమల ఏర్పాటుకు స్థల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

శ్రీరంగరాజపురం : మండలంలో పరిశ్రమల ఏర్పాటు కోసం పాతపాళ్యం గ్రామం 52 కనికాపురం వద్ద రాష్ట్ర పరిశ్రమల కార్పొరేషన్ జోనల్ మేనేజర్ స్థల పరిశీలన చేశారు. ఆయన మాట్లాడుతూ పాతపాళ్యం గ్రామం వద్ద పరిశ్రమల ఏర్పాటు కోసం స్థలం అనుకూలంగా ఉందన్నారు. ఈ మేరకు ర్యాట్ మ్యాప్ సిద్ధం చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ లోకనాథపిళ్లై, మండల సర్వేయర్ సురేష్, నాయకులు భాస్కర్‌నాయుడు, బాలాజీ నాయుడు ఉన్నారు.

పెద్దిరెడ్డి కుటుంబంపై కూటమి కుట్ర



ఎంపీని విడుదల చేయాలని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్, నాయకులు

- రెడ్‌బుక్ రాజ్యాంగంతోనే అక్రమ కేసులు
- పూతలపట్టు సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ ధ్వజం
- ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలని పూజలు

బంగారుపాళెం: పెద్దిరెడ్డి కుటుంబంపై కూటమి ప్రభుత్వం కక్షగట్టిందని వైఎస్సార్‌సీపీ పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ ఆరోపించారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి జైలు నుంచి విడుదల కావాలని కోరుతూ సోమవారం మండలంలోని మొగిలి వెంకటగిరిలో వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీకోదండరామాలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. ఆలయం ముందు కొబ్బరి కాయలు కొట్టారు. ఆయన మాట్లాడుతూ ఎంపీకి సంబంధం లేని కేసులో ఇరికించి చంద్రబాబు ప్రభుత్వం ఆనందం పొందుతోందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. మాజీ ఎమ్మెల్యే లలితకుమారి, జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, మండల పార్టీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, సోషియల్ మీడియా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిషోర్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అమరనాథ్, జిల్లా పార్టీ కార్యదర్శులు గోవిదస్వామి, రఘుపతిరాజు, కో–ఆప్షన్ సభ్యుడు ఫిరోజ్, మండల మైనారిటీ, ఎస్సీసెల్ అధ్యక్షులు షాకీర్, నాగరాజ, మండల మహిళా అధ్యక్షురాలు వాణిప్రియ, మండల యూత్ అధ్యక్షుడు గజేంద్ర, రైతు విభాగం నాయకులు పాలాక్షిరెడ్డి, అరుణామల్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి, మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న నాయకులు

ఏమిటీ పెత్తనం వినాయక?

తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలకు కొందరు టీడీపీ నేతలు అడ్డు తగులుతున్నారు. పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాలకు భంగం కలిగిస్తున్నారు. పవిత్ర పుణ్యక్షేత్రంలో వివాదం సృష్టిస్తున్నారు. ఉభయదారుల మధ్య చిచ్చుపెడుతున్నారు. బ్రహ్మోత్సవం ఖరారు కావడంతో చంద్రప్రభ వాహన ఉభయదారుల్లో వివాదం సృష్టిస్తున్నారు. 14 గ్రామాల్లో ఉన్న చంద్రప్రభ వాహన ఉభయదారుల సంఖ్యను 17 గ్రామాలకు పెంచాలని కొందరు రచ్చరచ్చ చేస్తున్నారు. ఇందులో ఓ ప్రజాప్రతినిధి, ఆయన సహాయకుడు జోక్యం చేసుకుంటున్నారని చంద్రప్రభ వాహన ఉభయదారులు ఆరోపిస్తున్నారు.

- చంద్రప్రభ ఉభయదారుల్లో టీడీపీ పెత్తనం?
- 27న కాణిపాక వార్షిక బ్రహ్మోత్సవం ప్రారంభం
- 14 గ్రామాల్లో చంద్రప్రభ ఉభయదారులు
- మరో మూడు గ్రామాలను చేర్చాలని టీడీపీ పట్టు
- ఇందులో ఓ ప్రజాప్రతినిధి, ఆయన సహాయకుడి జోక్యం
- మండిపడుతున్న కాణిపాకం వాసులు, చంద్రప్రభ వాహనదారులు



సాక్షి టాస్క్‌ఫోర్స్: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం అత్యంత పవిత్రమైనది. సత్య ప్రమాణాల నెలవుగా ఈ ఆలయానికి పేరుంది. ఇక్కడకు వచ్చే భక్తులు భయం, భక్తితో స్వామిని దర్శించుకుంటుంటారు. ఈ ఆలయ నిర్వహణలో పదుల సంఖ్యలో గ్రామాలు, వందల సంఖ్యలో ఉభయదారులు పాలుపంచుకుంటున్నారు. వీరు పూర్వీకుల ఆచారాలు, కట్టుబాట్లకు భంగం కలగకుండా ఆలయ పవిత్రతను కాపాడుతూ వస్తున్నారు. అయితే ఈ సేవల్లో చిచ్చు పెట్టేందుకు కొందరు టీడీపీ నాయకులు కుట్రలు పన్నుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

తెరపైకి చంద్రప్రభ వాహన ఉభయదారుల వివాదం


తరతరాలుగా కాణిపాక బ్రహ్మోత్సవాల్లో జరిగే చంద్రప్రభ వాహనానికి ఉభయదారులుగా కాణిపాకం, చిన్నకాంపల్లి, వడ్రంపల్లి, కారకంపల్లి, ఉత్తర బ్రహ్మణపల్లి, పుణ్య సముద్రం, సంతపల్లి, మారేడుపల్లి, అగరంపల్లి, 45.కొత్తపల్లి, చిగరపల్లి, తిరువణంపల్లి, బొమ్మసముద్రం వాసులు మాత్రమే వ్యవహరిస్తూ వస్తున్నారు. ఇప్పుడు పట్నం, పైపల్లి, సిద్ధంపల్లి గ్రామాల్లోని కొందరు ఉభయదారులు చేరాలని ప్రయత్నిస్తున్నారు. బ్రహ్మోత్సవాలకు ముహూర్తం ఖరారు కావడంతో ఈ వివాదం మళ్లీ తెరపైకొచ్చింది. గత రెండు రోజులుగా వివాదం తార స్థాయికి చేరింది. ఈ వివాదానికి కొందరు టీడీపీ బడానేతలు ఆజ్యంపోస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. చంద్రప్రభ ఉభయదారులను బెదిరింపులకు గురిచేస్తున్నట్లు కొందరు ఉభయదారులు ఆరోపిస్తున్నారు.

ప్రజాప్రతినిధి జోక్యం?

ఇక కొత్తగా చేరాలనుకుంటున్న వారికి ఓ ప్రజాప్రతినిధి అండదండలు ఉన్నాయనే విమర్శలు వస్తున్నాయి. అలాగే ఆ ప్రజాప్రతినిధి సహాయకుడే మళ్లీ ఈ వివాదానికి కారణమనే వాదనలు గట్టిగా వినిపిస్తున్నారు. ఉభయదారులుగా ఈ మూడు గ్రామాలను చేర్చుకుంటే.. మరిన్ని గ్రామాలు చేరేందుకు సిద్ధంగా ఉన్నాయని, వారిని కూడా చేర్చుకుంటారా..? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇంతకీ ఉభయదారుల్లో ప్రజాప్రతినిధి, ప్రజాప్రతినిధి సహాయకుడి జోక్యం సమంజసం కాదని ఉభయదారులు ఆగ్రహానికి గురవుతున్నారు. ప్రజాప్రతినిధులు బ్రహ్మోత్సవాన్ని ప్రశాంతంగా జరిపించేందుకు చూడాలే తప్ప.. తరతరాలుగా వస్తున్న ఆచార వ్యవహారాల్లో తలదూర్చడం సమంజసం కాదని మండిపడుతున్నారు. టీడీపీలో మరో వర్గం ఈ చేర్పును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై అధికారులు సైతం తలలు పట్టుకుంటున్నారు.

ఎరువుల కొరతపై జనాగ్రహం

- రైతు సమస్యలు పరిష్కరించాలంటూ వైఎస్సార్‌సీపీ నేతల ధర్నా
- కలెక్టర్‌కు విన్నవించిన నేతలు
- కూటమి నిర్లక్ష్యంపై మండిపాటు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్, చిత్తూరు సమన్వయకర్త విజయానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్



కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు విచ్చేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు

చిత్తూరు కలెక్టరేట్ : 'ఎరువులు లేక అల్లాడుతున్నారు. యూరియా, కాంప్లెక్స్ ఎరువులు దొరక్క రైతులు అవస్థలు పడుతున్నారు. రైతు భరోసా కేంద్రాల జాడే లేకుండా పోయింది. ప్రయివేటు దుకాణాల చుట్టూ చక్కర్లు కొడుతున్నా పట్టించుకోని పరిస్థితి నెలకొంది. విత్తనాలు సైతం సకాలంలో అందడం లేదు. పట్టెడన్నం పెట్టే రైతన్న కష్టాల్లో కూరుకుపోయినా ఈ కూటమి ప్రభుత్వానికి చీమ కుట్టినట్టుకూడా లేదు' అని వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు మండిపడ్డారు. పార్టీ పిలుపు మేరకు ఎరువుల కొరతపై సోమవారం ర్యాలీగా వెళ్లి కలెక్టర్ సుమిత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి ఆధ్వర్యంలో రైతులు స్వచ్ఛందంగా తరలివచ్చి తమ సమస్యలను ఏకరువు పెట్టారు.

హైటెక్ మోసం

ఎమ్మెల్సీ, కుప్పం నియోజకవర్గ సమన్వయకర్త భరత్ మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు మోసాల పర్వం కొనసాగుతోందన్నారు. ఈ తరుణంలో రైతులను సైతం హైటెక్ తరహాలో మోసగిస్తున్నారని మండిపడ్డారు. మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి క్షేత్ర స్థాయిలోకి వచ్చి పర్యటిస్తే తప్ప రైతులకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల బంగారుపాళ్యం పర్యటనకు మాజీ సీఎం వస్తే గానీ మామిడి రైతులకు న్యాయం చేయలేదని గుర్తుచేశారు. అన్నదాత సుఖీభవలో సవాలక్ష ఆంక్షలు పెట్టి, కోతలు విధించారని ధ్వజమెత్తారు.

రోడ్డున పడినా స్పందించరెందుకు?

జిల్లా వ్యాప్తంగా రైతులు తీవ్రంగా నష్టపోయి రోడ్డున పడినప్పటికీ కూటమి ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే, పూతలపట్టు నియోజకవర్గ సమన్వయ కర్త సునీల్ ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. గత ఐదేళ్ల పాలనలో మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతులను రారాజులుగా తీర్చిదిద్దారని గుర్తుచేశారు. రైతుభరోసా, ఆర్‌బీకే కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు గ్రామ స్థాయిలోనే సేవలందించారన్నారు. ప్రస్తుత కూటమి పాలనలో ఏ పంటకూ గిట్టుబాటు ధర దక్కడం లేదన్నారు. జిల్లాలో యూరియాను అసలు ధరకంటే రూ.200 ఎక్కువగా మార్కెట్‌లో విక్రయిస్తున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చావా రాజశేఖర్‌రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్, పాలఏకరి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుమార్‌రాజా, రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రటరీ గాయత్రీదేవి, మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీశ్, ఉద్యోగులు, పెన్షనర్స్ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయసింహారెడ్డి, రైతు నాయకులు కృష్ణారెడ్డి, రాష్ట్ర సోషల్ మీడియా జాయింట్ సెక్రటరీ కిశోర్‌రెడ్డి, పూతలపట్టు, ఐరాల, తవణంపల్లి మండలాల కన్వీనర్లు శ్రీకాంత్‌రెడ్డి, బుజ్జిరెడ్డి, హరిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ఎరువులు దొరక్క అవస్థలు

జిల్లా వ్యాప్తంగా రైతులు విత్తనాలు, యూరియా, ఎరువులు దొరక్క అవస్థలు ఎదుర్కొంటున్నారని వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ గడిచిన ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వం ఏ ఒక్క రైతుకూ చిల్లిగవ్వ ఇచ్చిన పాపాన పోలేదన్నారు. రైతులకు సకాలంలో ఎరువులు, యూరియా, విత్తనాలు ఇవ్వడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులు పండించే ఏ ఒక్క పంటకూ గిట్టుబాటు ధర దక్కడం లేదన్నారు. జిల్లాలో మామిడి రైతులు గిట్టుబాటు ధర లేక పూర్తిగా నష్టపోయారన్నారు.

డిమాండ్లు ఇవే

- రైతులకు వెంటనే ఎరువులను అందుబాటులోకి తీసుకురావాలి. యూరియా కొరతను నివారించాలి.
- అధికారులతో అత్యవసర సమావేశాలను ఏర్పాటు చేసి గ్రామస్థాయి వరకు ఎరువులు, విత్తనాల పంపిణీపై దృష్టి పెట్టాలి. గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాల్లో నిల్వలు పెట్టి అక్కడే రైతులకు సరఫరా చేయాలి.
- ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించాలి.
- ఎరువుల నిల్వలపై వ్యవసాయశాఖ తనిఖీలు చేపట్టాలి.
- ఎరువుల నిల్వలపై ప్రత్యేక యాప్, వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేయాలి.
- ఉచిత పంటల బీమాను వెంటనే అమలు చేయాలి. గత ఏడాది రైతు భరోసా డబ్బుల బకాయిలను వెంటనే చెల్లించాలి. అన్నదాత సుఖీభవ డబ్బులను ఎప్పుడు చెల్లిస్తారో ప్రకటించాలి.
- కేంద్రంతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైతుకూ ఏటా రూ.20 వేలు చెల్లించాలి

క్లుప్తంగా

వరసిద్ధుని సేవలో ప్రముఖులు



స్వామి చిత్రపటం అందుకుంటున్న హర్యానా రాష్ట్ర మాజీ డిప్యూటీ సీఎం దుష్యంత్‌సింగ్, మాజీ ఎంపీ గల్లా జయదేవ్

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని సోమవారం హర్యానా రాష్ట్ర మాజీ డిప్యూటీ సీఎం దుష్యంత్‌సింగ్ చౌతాలా దర్శించుకున్నారు. అలాగే మాజీ ఎంపీ గల్లా జయదేవ్ కూడా స్వామిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి, స్వామివారి దర్శనం కల్పించారు. అనంతరం పండితుల చేతుల మీదుగా ఆశీర్వచనాలు, స్వామి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో రవీంద్రబాబు పాల్గొన్నారు.

గోసంరక్షణ ట్రస్టుకు విరాళం



విరాళం అందజేస్తున్న దాత

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన గోసంరక్షణ ట్రస్టుకు సోమవారం గంటూరుకు చెందిన అంజిరెడ్డి రూ.లక్షను విరాళంగా అందజేశారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన భాగ్యం కల్పించారు.

ఇండియా రగ్బీ జట్టుకు ఎంపిక



అండర్-20 ఇండియా రగ్బీ జట్టు ఎంపికైన నర్రా అక్షయ

పలమనేరు: పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన నర్రా సురేష్ కుమార్తె నర్రా అక్షయ అండర్-20 ఇండియా రగ్బీ జట్టుకు ఎంపికైంది. ఇటీవల చెన్నైలో జరిగిన ఈ ఎంపికలో అక్షయ విశేష ప్రతిభ కనబరిచిందని ఆమె తండ్రి తెలిపారు. కాగా చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో స్పాన్సర్లు సినీ హీరో రాహుల్ బోస్ ద్వారా ఇండియా జెర్సీలను జట్టుకు అందజేశారని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో స్కూల్ గేమ్స్ సెక్రటరీ పోస్టుకు అర్హత, ఆసక్తి గల పీడీ, పీటీలు దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో వరలక్ష్మి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 2025–26 నుంచి 2026–27 సంవత్సరం వరకు స్కూల్ గేమ్స్ సెక్రటరీ (అండర్ 14, 17, 19) నియామకానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తూ 58 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న పీడీ, పీఈటీలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 7 వ తేదీలోపు దరఖాస్తులను డీఈవో కార్యాలయంలో అందజేయాలన్నారు.

నేడు 'టీ తాగుతూ మాట్లాడదాం రండి'

చిత్తూరు కలెక్టరేట్ : ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మంగళవారం కలెక్టరేట్‌లోని క్యాంటీన్‌లో 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివయ్య తెలిపారు.

అమ్మ పాలే బిడ్డకు అమృతం

- 7 వరకు జిల్లాలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు
- అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు



ఐరాల మండలం, పాలకలరెడ్డివారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు

చిత్తూరు కలెక్టరేట్ : తల్లిపాల ప్రాముఖ్యతపై ఐసీడీఎస్, ఇతర అధికారులు విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పుట్టిన బిడ్డకు ఎలా పాలను పట్టించాలనే విషయమై వైద్య బాలింతలకు సూచనలిస్తున్నారు. తల్లిపాల ఆవశ్యకతను తెలియజేస్తున్నారు. ముర్రుపాలను బిడ్డకు పట్టిస్తే వ్యాధినిరోధక శక్తి పెరిగి భవిష్యత్‌లో ఎలాంటి సమస్యలు రాకుండా ఉంటాయని అవగాహన కల్పిస్తున్నారు.

తల్లి పాలు బాగా రావాలంటే!

మహిళ గర్భందాల్చినప్పటి నుంచి పాలు, చేపలు, గుడ్లు, వెల్లుల్లిపాయ, తాజా ఆకుకూరలు, పండ్లు తగిన మోతాదులో తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రకృతి సిద్ధంగా లభించే పండ్లను ఆహారంలో చేర్చుకోవాలని, అతిగా స్వీట్లను తినరాదని చెబుతున్నారు. బిడ్డను పడుకోబెట్టి, నిలబెట్టి పాలు పట్టకూడదని, పాలిచ్చే సమయంలో కేఫీ అధికంగా ఉండే పదార్థాలు, శీతల పానియాలు తీసుకోకూడదని పేర్కొంటున్నారు.

ముర్రుపాలలో రోగ నిరోధక శక్తి అధికం

ముర్రుపాలలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. చాలా మంది అవగాహన లేక బిడ్డకు ముర్రుపాలను తాగించడంలో నిర్లక్ష్యం వహిస్తారు. ఈ పాలలో వ్యాధి నిరోధకశక్తిని పెంచే గుణం ఉంటుంది. సమతుల్యమైన పోషకాహార పదార్థాలు ఉంటాయి. చాలా రకాల వ్యాధులు రాకుండా తల్లిపాలు కాపాడతాయి. తల్లికి, శిశువుకు జ్వరం వచ్చినప్పుడు, టీకాలు ఇచ్చినప్పుడు కూడా పాలు పట్టించవచ్చు. తల్లిపాలు తాగే పిల్లల్లో ఆకస్మిక మరణాలు తక్కువేనని వైద్యులు చెబుతున్నారు.

అమృత జల్లు!

తల్లిపాలు ఎంతో స్వచ్ఛంగా ఉంటాయి. శ్వాసకోశ, అలర్జీ, ఆస్తమా, చర్మవ్యాధుల నుంచి బిడ్డలను రక్షిస్తాయి. బిడ్డ మానసిక, శారీరక వికాసానికి తోడ్పడుతాయి. అందుకే బిడ్డ జన్మించిన గంటలోపు తల్లికి వచ్చే ముర్రుపాలు పట్టించాలి. ఆ తర్వాత ఆరు నెలల వరకు తల్లిపాలు తప్ప మరే పదార్థాలూ ఇవ్వకూడదు. రోజులో 8 నుంచి 10 సార్లు లేదా ప్రతి రెండు నుంచి మూడు గంటలకు ఒకసారి బిడ్డకు తల్లిపాలు పట్టించాలి. రెండేళ్ల వరకు క్రమం తప్పకుండా పాలు పట్టాలి. తల్లిపాలలో ప్రొటీన్లు, ఒమెగా 3, ఒమెగా 6, ఒమెగా 9, విటమిన్లు ఉండి బిడ్డ మెదడుకు వికాసానికి తోడ్పడుతాయి. లాక్టోజుతో కాల్షియం నిల్వలు పెరుగుతాయి. బిడ్డను రక్తహీనత నుంచి కాపాడుతాయి. తొలి నెలలో శిశువులకు వివిధ రకాల అంటువ్యాధుల బారి నుంచి కాపాడుతాయి. డయేరియా, నిమోనియా వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా నిరోధిస్తాయి. క్యాన్సర్, చెవికి సంబంధించిన వ్యాధులు, గుండె వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయి.

జిల్లా సమాచారం	
మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు	1,795
మినీ అంగన్‌వాడీ కేంద్రాలు	625
జిల్లాలోని మహిళలు	9,31,752
గర్భిణులు	10,422
బాలింతలు	9,438
7 నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలు	56,131
మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు పిల్లలు	37,454

విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు

జిల్లా వ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 1 నుంచి 7వ తేదీ వరకు క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఈ సంవత్సరం 'తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహిద్దాం' అనే నినాదంతో అవగాహన కల్పిస్తున్నాం. ముఖ్యంగా ముర్రుపాలు తప్పనిసరిగా బిడ్డకు పట్టించాలని సూచిస్తున్నాం. బిడ్డకు పాలివ్వడం వల్ల తల్లులకు రొమ్ము, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ల నివారణకు దోహదపడుతాయని తెలియజేస్తున్నాం.

– వెంకటేశ్వరి, జిల్లా ఐసీడీఎస్ పీడీ.

గ్రామీణులకు నాణ్యమైన వైద్యం



మాట్లాడుతున్న ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

పాలసముద్రం (కార్వేటినగరం) : గ్రామీణులకు నాణ్యమైన వైద్యం అందించాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రం సత్యకుమార్ యాదవ్ సిబ్బందిని ఆదేశించారు. గత ప్రభుత్వంలో హిందూస్థాన్ కోకా–కోలా బేవరేజెస్ (హెచ్‌సీసీబీ) సీఎస్‌ఆర్ ఆధ్వర్యంలో మంజూరైన పీహెచ్‌సీ భవనాన్ని ఎమ్మెల్యే థామస్ సమక్షంలో మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణుల ఆరోగ్య సంరక్షణకు హెచ్‌సీసీబీ కట్టుబడి ఉందన్నారు. దీనిపరిధిలో చొడేపల్లె, శాంతిపురం, తవణంపల్లె, పాలసముద్రం, బుగ్గఅగ్రహారం, బైరెడ్డిపల్లె గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం స్థానిక ఏఎన్‌ఎంలు స్టాఫ్‌నర్సుగా పదోన్నతి కావాలని మంత్రికి విన్నవించారు. డీఎంహెచ్‌ఓ సుధారాణి, డీఐఓ హనుమంతరాజు, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ ఎస్.శివప్రకాష్‌రాజు, కోకా కోలా జీఎం హిమాంచుప్రియదర్శి, వైద్యాధికారులు మోహన్‌క్రిష్ణ, జయకుమార్, సీహెచ్‌ఓ సుబ్రమణ్యం, తహసీల్దార్ అరుణకుమారి, ఎంపీడీఓ విద్యావతి, ఎస్‌ఐ చిన్నరెడ్డెప్ప పాల్గొన్నారు.

తండ్రీ కొడుకుల నిర్వాకం... విద్యార్థుల పాలిట శాపం

- మాజీ మంత్రి ఆర్కేరోజా



నగరి : రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ నిర్వాకం విద్యార్థుల పాలిట శాపంగా మారిందని మాజీ మంత్రి ఆర్కే రోజా ధ్వజమెత్తారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ విద్యార్థులకు జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వాన్ని నిలదీశారు. జగనన్న పాలనలో ప్రతి విద్యార్థికీ ఒక్క ఏడాది కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ కష్టం రాకుండా జాగ్రత్తపడ్డారని తెలిపారు. కానీ ప్రస్తుత పాలనలో, విద్యాశాఖ మంత్రిగా లోకేష్ ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో జిల్లాలో సుమారు 600 మంది విద్యార్థులు ఫీజులు చెల్లించలేక, యూనివర్సిటీలు సర్టిఫికెట్లు ఇవ్వక ఉన్నత విద్య అయిన ఎంటెక్ అవకాశాన్ని కోల్పోయారని మండిపడ్డారు. రాష్ట్రంలో లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెడుతూ, పథకాన్ని నీరుగార్చడంతో పాటు వారి భవిష్యత్తునే నాశనం చేస్తున్నారన్నారు. 'మూలనున్న ముసలమ్మ కూడా బటన్ నొక్కుతుంది' అని డైలాగ్‌లు చెప్పిన వాళ్లు నేడు ఫీజు రీయింబర్స్‌మెంట్ బటన్ నొక్కడానికి ఎందుకింత కష్టపడుతున్నారన్నారు. పాలన ఇలాగే కొనసాగితే ప్రభుత్వం విద్యార్థుల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు.

లారీని ఢీకొన్న బైక్

- ఇద్దరు అక్కడికక్కడే మృతి
- మృతులు బంగారుపాళెం వాసులుగా గుర్తింపు



చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలు



పోలీసుల అదుపులో లారీ

చంద్రగిరి: ఎదురుగా వస్తున్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన సోమవారం రాత్రి పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి పనపాకం సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. చిత్తూరు జిల్లా, బంగారుపాళ్యం మండలం, తంబుగానిపల్లికి చెందిన పరంధామ(26) వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో సోమవారం రాత్రి తిరుపతికి పయనమయ్యాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన గడ్డం హరీష్ నాయుడు(24) తన తల్లితో కలసి కాణిపాకంలో ఉంటూ డ్రైవరుగా జీవనం సాగిస్తున్నాడు. కాణిపాకానికి చేరుకున్న పరంధామ, హరీష్ నాయుడును తన ద్విచక్ర వాహనంలో ఎక్కించుకుని ఇద్దరూ తిరుపతికి పయనమయ్యారు. పనపాకం టోల్‌ప్లాజా దాటుకుని వస్తున్న క్రమంలో ఎదురుగా తిరుపతి నుంచి చిత్తూరు వైపుగా వస్తున్న లారీని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో పరంధామతో పాటు హరీష్ నాయుడు అక్కడికక్కడే మృతి చెందారు. హైవే పోలీసులు లారీ డ్రైవరును అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రోడ్డు విస్తరణ పనులు ఆగిపోవడంతోనే..

పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి విస్తరణ పనులు ఆగిపోవడంతోనే ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు చెబుతున్నారు. రహదారి పనులు పనపాకం నుంచి జక్కలవారిపల్లి వరకు సుమారు కిలోమీటర్ మేర గత కొన్నేళ్లుగా ఆగిపోయాయి. దీంతో రహదారి విస్తరణ అధికారులు ప్రయాణికుల సౌకర్యార్థం తాత్కాలిక సింగిల్ రోడ్డును ఏర్పాటు చేశారు. ప్రమాదానికి గురైన ద్విచక్ర వాహనాదారులకు సింగిల్ రోడ్డు అన్న విషయం తెలియకపోవడంతో, మలుపు తీసుకోకుండా నేరు వెళ్లి లారీని ఢీకొట్టారు. ఇకనైనా రహదారి విస్తరణ అధికారులు స్పందిచాల్సి ఉంది.

స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని డాక్టర్.బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ఈనెల 4వ తేదీ నాటికి ఖాళీగా ఉన్న సీట్లకు అర్హులైన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్లు పొందవచ్చని ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఐ సొసైటీ జిల్లా కో–ఆర్డినేటర్ పద్మజ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ పాఠశాలలు, కళాశాల ప్రిన్సిపల్స్ వద్దకు వెళ్లి స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. రామకుప్పంలోని బాలుర గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో 41 ఖాళీలు, 6లో 8, ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ 18, బైపీసీలో 9, విజిలాపురంలో బాలురకు 5వ తరగతిలో 35, 6లో 1, 8లో 2, చిత్తూరులో బాలికలకు 5వ తరగతిలో 27ఖాళీలు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ 5, బైపీసీలో 1, పలమనేరులో బాలికలకు 5వ తరగతిలో 6, 8లో 1, ఎంఈసీలో 30, సీఈసీలో 4, కుప్పంలో బాలికలకు 5వ తరగతిలో 41, 7లో 1, ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ 9, బైపీసీ 5 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న బాలబాలికలు తక్షణమే సంబంధిత కళాశాలల ప్రిన్సిపల్స్‌ను సంప్రదించి ఈనెల 6వ తేదీ సాయంత్రం లోపు స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు చేసుకోవాలని కోఆర్డినేటర్ కోరారు.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



చంద్రగిరి/పాకాల: రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం మండల పరిధిలోని పాకాల–ముంగిలిపట్టు మధ్యలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. సుమారు 45 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న చిత్తూరు రైల్వే ఇన్‌చార్జ్ ఎస్‌ఐ రత్నమాల ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆచూకీ లభించలేదని, కుడిచేతి మీద దేవి అనే పేరుతో తెలుగులో పచ్చబొట్టు ఉండడాన్ని గుర్తించారు. అనంతరం గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 94926 29311 నంబరుకు సంప్రదించాలని కోరారు.

మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలని ప్రార్థనలు



బహదూర్ అలీషా దర్గాలో ప్రార్థనలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

చౌడేపల్లె: అక్రమ మద్యం కేసులో కుట్రపూరితంగా రాజంపేట ఎంపీ పీవీ.మిథున్‌రెడ్డిని జైలుకు పంపారని, త్వరగా ఆయనకు బెయిల్ రావాలని కోరుతూ దాదేపల్లెలోని మషాయక్ బహదూర్ అలీ షాబాబా దర్గాలో చౌడేపల్లె కాగతి సర్పంచ్ షంషీర్, మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు సనావుల్లాల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సోమవారం దర్గాలో బాబా మజ్జార్‌కు చాదర్‌ను కప్పి గంధం, పూలు సమర్పించి మత పెద్దల చేత ప్రత్యేక ప్రార్థనలు, దువ్వా చేశారు. కూటమికి మంచి బుద్ధి ప్రసాదించాలని, మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబంపై కక్ష సాధింపులు మానుకునే విధంగా చూడాలని ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. అన్యాయంగా మిథున్‌రెడ్డిను అక్రమ కేసులు ఇరికించారని, ఆకేసు నుంచి విముక్తికల్గిలా చూడాలని కోరుతూ పెద్దిరెడ్డి కుటుంబానికి మనోధైర్యం ప్రసాదించి బెయిల్ త్వరగా రావాలని కోరుతూ ప్రార్థనలు చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు షేర్‌ఖాన్, రియాజ్ అహమ్మద్, బషీర్‌సాబ్, జహీర్, నవాబ్, ఈనూస్, నిజాం, మాలిక్ తదితరులున్నారు.

'గుట్కా'మరకలపై విచారణ పూర్తి!

- బాధితులను విచారించిన పలమనేరు డీఎస్పీ
- ఓ సీఐ, ముగ్గురు సిబ్బంది పాత్ర ఉన్నట్లు సమాచారం!
- రెండు రోజుల్లో ఎస్పీకి నివేదిక .. ఆపై వేటు!

చిత్తూరు అర్బన్: చిత్తూరులో ఓ గుట్కా వ్యాపారి నుంచి భారీ మొత్తంలో లంచం తీసుకున్నారన్న ఆరోపణలపై ప్రత్యక్ష సాక్షుల విచారణ పూర్తయింది. గత నెల చిత్తూరు– బెంగళూరు రోడ్డులో గుట్కా లోడుతో ఓ వ్యాన్ వెళుతుండగా పోలీసు అధికారితోపాటు కొందరు సిబ్బంది కలిసి వాహనాన్ని ఆపారు. ఆపై రూ.లక్షల్లో వసూళ్లకు పాల్పడ్డారన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై చిత్తూరు ఎస్పీ మణికంఠ సీరియస్‌గా స్పందించడం, విచారణకు ఆదేశించడం తెలిసిందే. పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్ ఈ ఘటనపై విచారణ అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఉత్తరాది ప్రాంతానికి చెందిన గుట్కా వ్యాపారి చిత్తూరులో ఉండగా అతన్ని విచారించి అతని వాంగ్మూలం సైతం తీసుకున్నట్లు తెలుస్తోంది. డబ్బులు ఎలా అందజేశారు? ఎవరెవరు డబ్బులు కోసం సంప్రదించారు? ఎప్పటి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు..? ఎంత మొత్తం ఇచ్చారు..? ఏ రూపంలో ఇచ్చారు..? అనే ప్రశ్నలకు సమాధానాలు రాబట్టినట్లు విశ్వసనీయంగా తెలిసింది. బాధిత గుట్కా వ్యాపారితో పాటు పలువురు పోలీసు సిబ్బంది సైతం విచారణ అధికారికి వాంగ్మూలం ఇచ్చినట్లు సమాచారం. ఈ మేరకు ఎస్పీకి నివేదిక ఇవ్వడానికి ఫైలు సిద్ధం చేస్తున్నారు. ఓ సీఐతో పాటు ముగ్గురు సిబ్బంది పాత్ర ఇందులో ప్రత్యక్షంగా ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

మరో రెండు రోజుల్లో పూర్తిస్థాయి ఫైలు సిద్ధం కానున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా రెండు రోజుల్లో చిత్తూరులో కలకలం రేపిన గుట్కా అవినీతి మరకల వ్యవహారం ఎస్పీ వద్దకు చేరనుంది. దీనిపై ఎస్పీ కూడా ఎవ్వర్నీ ఉపేక్షించేలాగా కనిపించడం లేదు. తప్పు చేసిన వారిని శిక్షించడానికి ఆయన ఇప్పటికే ఓ అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. తాను జిల్లా ఎస్పీగా బాధ్యతలు తీసుకున్న తర్వాత దాదాపు 40 మందికి పైగా తప్పు చేసిన పోలీసులను సస్పెండ్ చేయడం.. ఈ కేసులో ఒక్కరిని ఉపేక్షించినా ప్రజల్లోకి మరోలా వెళుతుందని అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. ఫలితంగా తప్పు చేసిన అధికారి, సిబ్బంది గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. వారిని వెంటనే రిజర్వ్ (వీఆర్)కు తీసుకుంటారా..? వేటు వేస్తారా..? అనేది తేలేందుకు కొన్ని రోజులు ఆగాల్సిందే.

విన్నవించినా..ఫలితం లేదు సార్!

- కలెక్టరేట్‌కు క్యూ కట్టిన అర్జీదారులు
- వివిధ సమస్యలపై 320 అర్జీలు

చిత్తూరు కలెక్టరేట్ : తమ సమస్యల పై ఎన్నిసార్లు విన్నవించుకుంటున్నా న్యాయం మాత్రం దక్కడం లేదని అర్జీదారులు వాపోయారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తమ గోడు వెళ్లబోసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యలపై 320 అర్జీలను అందజేశారు. కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డీఆర్వో మోహన్ కుమార్, ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పడాల్ తదితరులు అర్జీలు స్వీకరించారు.



న్యాయం చేయాలని కోరుతున్న మహాలక్ష్మి మహిళా సంఘం సభ్యులు

రాజకీయ నాయకుల పేర్లు చెప్పి బెదిరిస్తున్నారు

రాజకీయ నాయకుల పేర్లు చెప్పి బెదిరిస్తున్నారని పెనుమూరు మండలం, కత్తిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ, మాణిక్యరాయునిపల్లె దళితవాడకు చెందిన మహాలక్ష్మి మహిళా సంఘం సభ్యులు లక్ష్మమ్మ, చిన్నక్క వాపోయారు. తమ సంఘంలో ఇది వరకు పది మంది సభ్యులు ఉండేవారని, అందులో ఇద్దరు సభ్యులు తీసుకున్న రుణం సరిగా చెల్లించకపోవడం, సంఘం జరుపుకునేందుకు హాజరుకాకపోవడంతో ఆ ఇద్దర్నీ సంఘం నుంచి తొలగించినట్లు తెలిపారు. తొలగించినందుకు రాజకీయ నాయకుల పేర్లు చెప్పి తమను భయపెడుతున్నారన్నారని వాపోయారు. ఈ మేరకు పీజీఆర్‌ఎస్‌లో అర్జీ అందజేయడం వల్ల తమ గ్రూపు సభ్యులు ఒక్కొక్కరికీ రూ.1.50 లక్షలు చెల్లించి గ్రూపును రద్దు చేసుకోవాలని తమ సంఘం ఈవో అధికారి బెదిరిస్తున్నారన్నారు. తమకు న్యాయం చేయాలని వారు కోరారు.



నిరసన తెలుపుతున్న కాణిపాకం పంచాయతీ వాసులు

హైకోర్టు తీర్పును ఉల్లంఘిస్తున్నారు

హైకోర్టు తీర్పును ఉల్లంగిస్తున్నారని కాణిపాకం పంచాయతీ మాజీ సర్పంచ్ గోపీనాథ్, గ్రామస్తులు వాపోయారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ తమ గ్రామ పంచాయతీ పరిధిలో దాదాపు 5 వేల మంది జనాభా ఉన్నారన్నారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన శ్మశాన స్థలంపై గతంలో ఎండోమెంట్ ఈవో జోక్యం చేసుకుని హైకోర్టులో కేసు వేశారన్నారు. ఆ కేసులో తీర్పు పంచాయతీకి అనుకూలంగా వచ్చిందన్నారు. అయితే హైకోర్టు తీర్పును ఉల్లంఘించి శ్మశానానికి సంబంధించిన స్థలాన్ని రెవెన్యూ అధికారులు 1 బీ లో నమోదు చేసి డ్రోన్ సర్వే చేస్తున్నారన్నారు.

జీవనోపాధి కల్పించండి



జీవనోపాధి కల్పించాలని కోరుతున్న ఎరుకులపురం గ్రామస్తులు

జీవనోపాధి కల్పించండి సారూ అంటూ సదుం మండలం, ఎరుకులపురం గ్రామానికి చెందిన శంకర, అంజీ కోరారు. తమది బాతులు మేపుకునే వృత్తి అని, ఆ వృత్తిలో విపరీతమైన నష్టాన్ని ఎదుర్కొన్నామన్నారు. వడ్డీ వ్యాపారులు బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామంలో ఇప్పటికీ సొంత నివాసం లేక ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. తమకు స్థిరమైన జీవనోపాధి కల్పించి న్యాయం చేయాలని కోరారు.

న్యాయం చేయండి



క్వారీ పనులు ఆపాలని కోరుతున్న గడ్డూరు గ్రామస్తులు

క్వారీ పనుల వల్ల తమ గ్రామంలోని గృహాలు చీలిపోతున్నాయని బైరెడ్డిపల్లి మండలం టి.గడ్డూరు గ్రామస్తులు జీవీ భాస్కర్‌రెడ్డి, రవిరెడ్డి, మునిరత్నమ్మ, పుష్పకుమారి వాపోయారు. తమ గ్రామానికి అర్ధ కిలోమీటరు దూరంలో క్వారీ పనులు నిర్వహిస్తున్నారన్నారు. ఆ క్వారీ పేలుళ్ల వల్ల గ్రామంలోని ఇళ్లకు పగుళ్లు వస్తున్నాయని వాపోయారు.


అత్యవసర నంబర్లపై అవగాహన ముఖ్యం



మాట్లాడుతున్న మహిళా స్టేషన్ సీఐ శ్రీనివాసరావు

చిత్తూరు కలెక్టరేట్ : బాలికలకు అత్యవసర నంబర్లపై అవగాహన ఉండాలని చిత్తూరు మహిళా పోలీసు స్టేషన్ సీఐ శ్రీనివాసరావు చెప్పారు. ఈ మేరకు సోమవారం నగరంలోని విజయం డిగ్రీ కళాశాలలో మహిళా శక్తి యాప్, అత్యవసర ఫోన్ నంబర్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళల భద్రతకు ప్రభుత్వం శక్తి యాప్ అమలు చేస్తోందన్నారు. ప్రతి విద్యార్థినీ మహిళా శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. కళాశాలలో శక్తి వారియర్ గ్రూప్‌ను ఏర్పాటు చేయాలని, గ్రూప్ ప్రత్యేకతలను వివరించారు. కళాశాల చైర్మన్ తేజోమూర్తి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న ఎస్పీ

చిత్తూరు అర్బన్: సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దని ఎస్పీ మణికంఠ చందోలు పోలీసు అధికారులను ఆదేశించారు. నగరంలోని తన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీతోపాటు అడిషనల్ ఎస్పీ రాజశేఖరరాజు, డీఎస్పీ రాంబాబు కలసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సైబర్ క్రైమ్, వేధింపులు, కుటుంబ తగదాలు, నగదు లావాదేవీలకు సంబంధించి 55 ఫిర్యాదులు వచ్చాయి.